## "విపులాచ పృథ్వీ"

"మీ పెన్ను ఒకసారి యిస్తారా ?" అని అందమైన అమ్మాయి అడిగింది. రామం మాట్లాడకుండా ఆ మనిషి వంక చూశాడు. ఆ పిల్ల మళ్ళీ యింకొకసారి మీ పెన్ను ఒకసారి యిస్తారా మనిఆర్డర్ ఫారమ్ పూర్తిచెయ్యాలి అని అడిగింది.

"ఇవ్వను" అని రామం అన్నాడు. ఆ పిల్ల నిప్పులు చెరిగే కళ్ళతో రామం వంక చూసింది. గిరుక్కున వెనక్కి తిరిగింది. ప్రక్క కౌంటరు దగ్గరకు వెడుతూ "బ్రూట్! మేనర్సు తెలియవు అవి రామానికి వినిపించేలాగా అన్నది.

రామం చిరునవ్వు నవ్వాడు. రద్దీగా వున్న పోస్టాఫీసులో చాలా మంది జనం ఈ సంఘటన చూశారు. ఆ పిల్ల అక్కడ నుంచి వెళ్లిపోగానే అతని వంక అంటువ్యాధి వాడిని చూసినట్టు చూడడం మొదలుపెట్టారు.

రామం యివేం లక్ష్య పెట్టలేదు. తనురాస్తున్న ఉత్తరం పూర్తిచేసి డబ్బాలో పడేసి బయటకు వచ్చి నిలబడ్డాడు.

సిగిరెట్టు జేబులోంచి తీశాడు.

"మీ పెన్ను తీసుకుని పారిపోతానని అనుకున్నారా"

అదే మళ్ళీ అందమైన అమ్మాయి కంఠం ఈ సారి కోపంగా ప్రశ్నించింది.

రామం ఉలిక్కిపడి అటు చూశాడు. అంతలోనే చిరునవ్వు నవ్వి.

"నేను బ్రూట్"ని అనిఅన్నారు.

ఆ పిల్ల అయోమయంగా యితని వంక చూసింది. మనస్సులో ఏమనిపించిందో ఏమో "ఐయాం సారి" అని అన్నది.

"దేనికి" అని రామం అడిగాడు.

ఆపిల్ల ఏమి సమాధానం చెప్పకుండా విసవిసా నడిచిపోయింది.

రామం వడివడిగా అంగలు వేసుకుంటూ ఆ మనిషి వెంట వెళ్ళాడు.

'ఏమండి' అంటూ పిలిచాడు.

ఆ మనిషి వెనక్కి తిరిగి చూసింది.

"పెన్ ఇవ్వలేదని ఏమీ అనుకోకండి. కారణం మీకు చెప్పలేను, చెప్పినా మీకు అర్థంకాదు అంటూ ఆవిడ సమాధానం కోసం నిరీక్షించకుండా ముందుకు సాగిపోయాడు.

ఆ పిల్ల యితనివంక ఒక్కక్షణం చూసి, ఫూల్ అని అనుకున్నది.

రెండు రోజులు గడిచిపోయాయి, రామం ఆంజనేయస్వామి గుడి దగ్గర పరాకతుగా నిలబడి వున్నాడు. పది పన్నెండుమంది ఆడపిల్లల గుంపు గుడిలోకి వెడుతోంది. వెడుతూ ఒకపిల్ల వెనక్కి తిరిగి రామం వంక చూసింది. చూపులు కలిసీ కలియకుండానే చిరునవ్వుతో పలకరించింది. రామం వులిక్కిపడ్డాడు. ముఖం ప్రక్కకు త్రిప్పుకుని అక్కడ నుంచి వెళ్లిపోయాడు. ఆ పిల్లమళ్ళీ వెనక్కి తిరిగి చూసింది.

"ఎంత గర్వం" అని అనుకుంది. మళ్ళీ ఒక్కక్షణంలో "ఆ గర్వం అణచవలసిందే" అని మనస్సులో ఆలోచన కలిగింది.

ఆరోజు సాయంకాలం మోటారు సైకిలు అరవై మైళ్ళవేగంగా వెడుతోంది. అంతకంటే వేగంగా రామం మనస్సుపరుగెత్తుతోంది.

ఆడవాళ్ళని నమ్మకూడదు. ఈ ఆడవాళ్ళని నమ్మకూడదు అని అంటోంది.

తనకంటే వేగంగా యింకొక కారు తనని దాటివెళ్ళిపోయింది. తన మోటారు సైకిలు ఆపమని దాంట్లోంచి హుకుం. సైకిలు రోడ్డు ప్రక్కన ఆగింది.

ఇన్స్పెక్టరు శర్మ దాంట్లోంచి దిగాడు.

"ఇది విమానం కాదు తమ్ముడూ మోటారు సైకిలు జాగర్తగా నడపటం మంచిది. లైసెన్సు మాట ఎలావున్నా రెండేళ్ళు కటకటాలలో కూర్చుంటావు. గో స్లో"

"Thank you Sir" అని రామం అన్నాడు.

నెమ్మదిగా నడుపుకుంటూ యింటికి వెళ్ళాడు.

కిటికీ దగ్గర క్రొత్త Life మాగజీన్ పడేసి వుంది. యదాలాపంగా ఆ పత్రిక తీశాడు. టప్‌మని ఏదో క్రింద పడ్డట్టు చప్పుడైంది. పెన్ క్రింద పడివుంది. తీసి అదుర్దాగా దాని వంక చూశాడు. అది చాలా ఖరీదైన పెన్. బంగారం పూల మీద అనేక వేల గీతలున్నాయి. నీలం సిరా గొట్టం మీద అనేక చారలున్నాయి. గొట్టం చివర ఎవరో కొరికిన పంటి గుర్తులున్నాయి. ఈ గీతల వెనక దాగి చెరిగిపోకుండా ఒక పేరు కపిపిస్తోంది. "శకుంతల".

రామం మనస్సులోంచి ఒక నిట్టూర్పు వచ్చింది.

'I hate Woman' అని అన్నాడు. పెన్ జేబులో పెట్టుకుని మంచం మీద పడుకుని చదవడం మొదలుపెట్టాడు. దేశదేశాల విశేషాలు దాంట్లో కనిపిస్తున్నాయి. రామం ఉలిక్కిపడి జేబు వంక చూసుకున్నాడు. జేబు అంతా సిరా అయింది ఉలిక్కిపడి పెన్ జేబులోంచి తీసి చూశాడు. పెన్ గొట్టం క్రింద భాగం నిలువుగా అరంగుళం మేర పగిలింది.

పెన్ పగిలింది. మనస్సు చివుక్కుమన్నది. ఆ పెన్ వంక కన్నార్పకుండా అలా చూస్తూ వున్నాడు. పగిలిన చారగుండా ఒకొక్కబొట్టు సిరా బయటకు వస్తోంది. పగులు వంక యింకొకసారి చూశాడు. "శకుంతల" అనే అక్షరాలు నిలువునా పగిలాయి.

రామం ఏం మాట్లాడకుండా ఆ పెన్ను వంక చూస్తూ కూర్చున్నాడు. మనస్సు గద్గదమైంది. కన్నీరు కంఠాన్ని అడ్డుకుంది.

మనస్సుకి ఏదో నిశ్చయం వచ్చింది. టెలిఫోను తీసి ఒక నెంబరు పిలిచాడు.

"ట్రంక్స్ ఎన్క్వయిరీస్" అవి అవతలి కంఠం పలికింది.

ఫోర్డబుల్ టూ సిక్స్ నుంచి మాట్లాడుతున్నాను. పి.పి.కాల్ టూ కలకటా 86214 పి.పి. శకుంతలాదేవి, అర్జంట్ కాల్.

అవతలి కంఠం ఒక క్షణం తరువాత "టోకెన్ నెంబర్ సెవెన్" అని పలికింది.

"థాంక్యూ !" అంటూ ఫోను పెట్టేసి సిగరెట్టు వెలిగించి కిటికీ దగ్గర నిలబడ్డాడు.

టోకెన్ నెంబరు సెవెన్ !! శకుంతల !!

సిగరెట్టు సగం కూడా కాలకుండానే ట్రంక్కాల్ వచ్చింది. "కలకత్తా" మాట్లాడండి అని ఆపరేటర్ కంఠం పలికింది.

"హల్లో శకుంతలా ! నేను రామాన్ని ఎల్లా వున్నావు" అని రామం అన్నాడు.

"నేను ఎల్లావున్నది నీకు అవసరం ! ఇహ ఎప్పుడు నాకు ఫోను చెయ్యొద్దు."

శకుంతలా ! శకుంతలా ! అంటూ రామం ఎలుగెత్తి పిలిచాడు.

అవతల ప్రక్కన టెలిఫోను పెట్టేసిన శబ్దం వినిపించింది. రామం అల్లాగే టెలిఫోన్ వంక చూస్తు పార్టీ ఫోను పెట్టేశారు" అని ఆపరేటర్ అన్నాడు.

రామం మనస్సుల్లోంచి ఒక నిట్టూర్పు వచ్చింది.

దృష్టి టేబుల్క్లాత్ మీదకు మరలింది. పెన్ను పెట్టినచోట ఒక పెద్ద సిరామరక ఏర్పడింది.

ఈ పెన్ వెంటనే బాగు చేయించాలి.

పెన్ తీసుకుని చకచకా బయలుదేరి ఒక షాపులోకి వెళ్లాడు.

"ఈ పెన్ను రిపేరు చెయ్యాలి. ఎంతైనా సరే" షాపు వాడేం మాట్లాడలేదు. పెన్ను వంక తదేక ధ్యానంగా చూశాడు. సిరా తీసేసి కడిగి చూశాడు. ఎలక్ట్రిక్ లైట్ క్రింద చూశాడు. మైక్రోస్కోప్తో పగులు వున్నంతమేర పరీక్షగా చూశాడు. చివరికి పెదవి విరిచాడు.

ఈ పెన్ను యిహ బాగుపడదు ఐనా మీలాంటివాళ్ళు క్రొత్త పెన్ను కొనుక్కోవాలి గాని పాతవి రిపేరుచేయించడం ఏమిటి అని అన్నాడు.

పగిలినంత మేరా రేకుతో కట్టువేయిస్తే

ఆ ప్రక్కన పగులుతుంది.

"అంతేనా !"

"అంతే"

"థాంక్యూ !" అంటూ రామం అక్కడ నుంచి బయలుదేరి వచ్చేశాడు.

దగ్గరలో వున్న గుడిలో ఆకతాయి మూక ఎవ్వరో అదే పనిగా గుడిలో గంటలు కొడుతున్నారు.

పరధ్యానంగా అన్యమనస్కుడుగా రామం కూడా గుళ్ళో అడుగుపెట్టాడు. ఎదుట ఎంతో అందమైన చెన్నకేశవస్వామి విగ్రహం కన్నుల పండువగా వుంది. కాని రామానికి ఆ విగ్రహం కనిపించటం లేదు. ఆ గుడిలో గంటలు వినిపించటంలేదు.

పెన్ను చెడిపోయింది. పెన్ను యిహ బాగుపడదు.

అంతేనా ? అంతే !

రామం అడుగు కదపకుండా అక్కడే నిలబడ్డాడు, మనస్సుకి అర్థం కాని ఆవేదన. అంతులేని ఆరాటం.

ఎందుకు ?

ఎందుకు రామం నిన్ను విస్మరించిన వారిని గురించి విచారిస్తావు ?

నన్ను నేను విస్మరించుకోలేక

మూర్ఖుడివి

అవివేకివి

కాదని అనటంలేదు.

మూసిన తలుపుల వంక చూస్తూ నిలబడితే ఏం లాభం ! రామం !

తలుపులు వెనక దాగిన గాథలు మరిచిపోలేక.

గాథలలో నీకు మిగిలేదేమిటి ?

తీరని వ్యధలే.

వ్యధలతో వేదనలతో నీ మనస్సుని పాడుచేసుకుని పిచ్చివాడివి కావద్దు రామం.....

YOP-33A

ఆ పెన్ను అవతల పారేయి రామం !

"పారెయ్యలేను, శకుంతలని మరిచిపోలేను. మరిచిపోలేను" అంటూ రామం పెద్దకేక పెట్టాడు.

తన కళ్ళ ఎదుట పెద్ద వెలుగు వచ్చింది. ఉలిక్కిపడి కన్ను తెరిచాడు. కర్పూర హారతి పుచ్చుకుని అర్చకుడు ఎదురుగా నిలబడ్డాడు. తనకు తెలియకుండానే చేతులు వాటంతట అవే హారతి కళ్ళకు అదుకున్నాయి.

హారతి తీసుకుని అర్చకుడు లోపలికి వెళ్ళిపోయాడు.

స్వామి విగ్రహం వంక చూశాడు. గిరుక్కున వెనక్కి తిరిగాడు "బాబూ ! ప్రసాదం" అని అర్చకుడి కంఠం వినిపించింది.

రామం ఆగలేదు. అడుగు ముందుకుసాగింది.

"ఆగు !" అని అదే కంఠం ఈసారి ఆజ్ఞాపించింది.

గడపదాటిన అడుగు వెనక్కి తిరిగింది.

"హారతి తీసుకున్న వాళ్ళు ప్రసాదం పుచ్చుకోకుండా వెడితే మహాఅపచారం" అని అన్నాడు.

రామం తలవంచుకుని నిశ్శబ్దంగా దోసిలిపట్టాడు. రెండు పువ్వులు, ఒక అరటిపండు అతని చేతిలో వుంచబోతూ అర్చకుడు ఆ చేతుల వంక చూశాడు. అన్నీ సిరామరకలు.

"చేతిలో సిరామరకలు" అని అన్నాడు.

"బ్రతుకే సిరామరకలు" అని రామం అన్నాడు.

ప్రసాదం చేతిలోపెడుతూ అర్చకుడు "వెళ్ళేటప్పుడు రోడ్డుప్రక్కగా వెళ్ళుబాబు" అని అన్నాడు.

ప్రసాదం తిని రామం బయటకువచ్చి గుడిగోపురం వంక చూశాడు. గాలిలో కదులుతున్నట్టు అనిపించే గాలిగోపురం చూడగానే దూరంగా ఏవో కొండలు, కొండల వెనుక కోనలు, భూలోకస్వర్గమనిపించే ఆ మనోహరదృశ్యం, ఆ కొండ శిఖరాన అందమైన బంగళా, బంగళా మేడ మీద గాజు కిటికీకి తలుపులు వెనుక ఎవరిదో సుందర విగ్రహం.

ఇక్కడికి అక్కడికి దూరం, చాలాదూరం అంతేలేని దూరం రామం ! నువ్వు అక్కడికి వెళ్లలేవు.

ఎందుకని.

నీ తపస్సుకి అర్థం లేదు. లక్ష్యంలేదు... ఆ సాధనలో నువ్వేం పొందలేవు రామం.

మనస్సు ఎక్కడోవుంది. పాదాలు ఎటో దారితీస్తున్నాయి.

"పెన్ హాస్పిటల్" అని ఎదురుగా పెద్దబోర్డు కనిపించింది. వడివడిగా అటువైపు రెండడుగులు వేశాడు.

ఎవరో వెనకనుంచి పెద్దపెట్టున కేకపెట్టారు. సడన్‌బ్రేకులు వేసుకుని ఏదో ఒక చిన్నకారు ఆగింది.

డ్రైవరు కోపంగా చూశాడు. అంతకన్నాకోపంగా కారులో కూర్చున్న అసామి చూశాడు.

"ఐ యాం సారీ" అని రామం అన్నాడు.

"చావదల్చుకుంటె రైలు క్రింద పడవయ్యా" అని డ్రైవరు అన్నాడు. కారు కదిలి కనుచాటైంది. మనస్సు మళ్ళీ ఈ ప్రాంతానికి వచ్చింది. చూపు పెన్ను మీద నిలిచింది.

షాపులో కుర్రవాడు పెన్నువంక చూశాడు. పెదవి విరిచాడు. "గొట్టం మోల్డింగ్‌లా విచ్చుకుంది. అంతవరకూ కట్‌చేసి మరలువేసి బిగించుదాం, కాని బాగుపడుతుందని గ్యారంటీ యివ్వటం కష్టం"

మనిషిని కట్‌చేసి మరలుచేసి మళ్ళీ బిగించగలమా ? "సార్ ?" అని కుర్రవాడు బిగ్గరగా పిలిచాడు.

రామం ఉలిక్కిపడ్డాడు.

పెన్ను... అంటూ ఆకుర్రవాడు ఏదోచెప్పబోయాడు.

దీన్ని కట్ చెయ్యకుండా రిపేరు చెయ్యలేరా ?

"ఎరల్‌డైట్‌వేస్తే అతుకుతుందని అనుకుంటాను..... కాని పగులు కనిపిస్తూనే వుంటుంది."

"పెన్ యిక్కడ వదిలిపెట్టి వెళ్ళి రేపు యిదే సమయానికి రండి."

"పెన్ కట్‌చేయ్యకుండా రిపేరు చేయ్యడానికి వీలు అవుతుందా" ఈ మాట వినగానే రామానికి వెయ్యిపుట్ల బలం వచ్చింది.

"సరే ! రేపు యిదే సమయానికి వస్తాను" అంటూ అక్కడ నుంచి బయలుదేరాడు.

షాపు నుంచి బయటకు వచ్చేసరికి స్కూల్ నుంచి యింటికి తిరిగి వచ్చేపిల్లలు కనిపించారు. అందులో తొమ్మిది పది సంవత్సరాల వయస్సున్న అందమైన ఆడపిల్ల తన స్నేహితురాళ్ళతో ఏదోకబుర్ల చెబుతూ పకపకా నవ్వుతోంది.

శకుంతల పిల్లలెందరో; పిల్లలు గుంపులు గుంపులుగా వెళ్ళిపోయారు.

మోటారు సైకిలు స్టార్టు చేస్తూ వుండగా పెన్నుషాపులో కుర్రవాడు బయటకు వచ్చాడు.

బండి మీదాసార్ ? ఇందాకటి నుంచి ఎవరిదోనని కాపలా కాయలేక సతమతమవుతున్నాం." అని అన్నాడు.

రామం ఏం మాట్లాడకుండా కుర్రవాడి చేతిలో ఒక అర్ధరూపాయి పెట్టి ఇంటికి బయలుదేరాడు.

మనస్సున ఒకటికి పదిసార్లు మార్మోగిన మాట... "నెంబరు టు, కచ్చేరి రోడ్డు" ఇంటికి రాగానే మనస్సులో మసిలిన మాట శకుంతల.

సిరామరక పడ్డ చొక్కా, టేబుల్‌క్లాత్ తీసిమాసిన బట్టల పెట్టెలో పడేశాడు.

శకుంతల ఎంత నిష్ఠూరంగా మాట్లాడింది ? ఎంత అసభ్యంగా ప్రవర్తించింది. ఆనాడు తను కూడా యిల్లాగే ప్రవర్తించి వుంటే శకుంతల ఏమై వుండి వుండేది.

పంచభూతాలలో కలిసిపోయి ఉండేది.

(ఆనాడు అనేక వసంతాలు వెనక అని ఈనాడు అనిపిస్తుంది, మనస్సుని మధనం చేసి చూస్తే నిన్న మొన్నటిలాగ అనిపిస్తోంది.)

ఒకరోజున శకుంతల తనంతట తానే తమ యింటికి వచ్చింది. సరాసరి వచ్చి అమ్మ దగ్గర కూర్చుంది. "మేము ఈ ప్రక్క యింట్లోకి అద్దెకి వచ్చాం పిన్నిగారు" మా నాన్నగారికి ఈ వూరు ట్రాన్స్ఫర్ అయింది... అమ్మ సుస్తీ మనిషి ఎక్కడికీ కదల్లేదు. ఇంట్లో అన్నింటికి నేనే..." అంటూ

తనని తానే పరిచయం చేసుకుంది. ఆడపిల్ల లేని అమ్మకు ఆ పిల్లని చూడగానే ఎక్కడ లేని ముచ్చటా వేసింది. "రావే తల్లి" అని ఆపేక్షగా పిలిచింది. ఆనాటి నుంచి ఆ పిల్ల తమ యింటికి తరుచూ రావటం మొదలుపెట్టింది. ఆ రావటం అనేది అమ్మకోసం కంటే తనని పలుకరించటం కోసమనే తెలియడానికి అట్టేకాలం పట్టలేదు. ఆ పిల్ల చనువూ చొరవా చూస్తే తనకే ఆశ్చర్యం వేసింది ఒక్కొక్కసారి మొహమాటం కూడా వేసేది. అమ్మని అడ్డం పెట్టుకుని గంటల తరబడి తనతో బాతాఖానీ కొట్టేది.

శకుంతల వచ్చి తనతో మాట్లాడుతూ వుంటే తనకు ఎంతో సరదా వేసేది...

"రామం !" అంటూ అమ్మ ఒకరోజు పిలిచింది.

మర్నాడు సాయంకాలందాకా కాలం ఎల్లా గడిచిందో తెలియదు పెన్నురిపేరు షాపుకి వెళ్లాడు. ఇతన్ని చూడగానే ఆ కుర్రవాడు "సారీ సార్ ఏం లాభం లేదు రిపేరుకాదు" అంటూ తిరిగి ఇచ్చేశాడు.

దీనికి చార్జీ ఎంత ?

YOP-34A

"రిపేరు కాలేదుగదా చార్జీ ఏంలేదు" అని కుర్రవాడు అన్నాడు.

"థాంక్యూ" అని రామం బయటకు వచ్చాడు.

మోటారు సైకిలు బస్సు స్టాపు దగ్గర ఆగింది. బస్సుస్టాపు నిర్మానుష్యంగా వుంది.

రెండు మాటలు మనస్సులో మసలుతున్నాయి.

పెన్ బాగుపడదు... నెండరు టు కచేరీ రోడ్డు, మైలాపూర్

బస్సులు వస్తున్నాయి. జనం వస్తున్నారు ఎక్కుతున్నారు. ఎక్కుతున్నారు బస్సులు వెళ్లిపోతున్నాయి.

రామం అల్లాగే నిలబడి చూస్తున్నాడు.

అల్లా ఎంతసేపు గడిచిందో ఏమో, ఎవరిదో మెత్తటి కంఠం "నో పార్కింగ్ హియర్" అని అంది. రామం ఉలిక్కిపడి వెనిక్కి తిరిగాడు.

ఆ చిన్నది.

"హల్లో అని అన్నాడు."

"ఎవరి కోసమో వెయిట్ చేస్తున్నట్టున్నారు !" అని ఎదురు ప్రశ్న వచ్చింది.

రామం సమాధానం చెప్పేలోపలే "సాయంకాలం ఏడుగంటలకి శాంథోమ్ బీచ్‌కి వెడతాను. రేడియో కాబిన్ దగ్గర యిసుకలో కూర్చోడమంటే నాకు చాలా సరదా" అని అంటూనే చిన్నది విసవిసా నడిచి వెళ్ళిపోయింది.

చిన్నది వెళ్ళిన దిక్కే రామం చూస్తూ నిలబడ్డాడు. స్కూలు పిల్లలు గుంపులు గుంపులుగా వస్తున్నారు. ఆ రెండుజడల అమ్మాయి ఈవాళ కూడా కనిపించింది.

పెద్దయితే యింకా ఎంత బాగుంటుదో !

దూరంగావున్న గడియారం టైము సాయంకాలం అయిదున్నరని చెబుతోంది.

ఏడుగంటలకు శాంథోమ్‌బీచ్, రేడియో రూమ్...

అనుమానం లేదు తనని అక్కడ కలుసుకోమని చిన్నదాని సందేశం. కాని తనని కలుసుకుంటే ఆ మనిషికి వచ్చేలాభం ఏమిటి ?

పెన్ను అడిగితే యివ్వలేదని తనని దూషించడానికా ? ఏమో ? ఎందుకనో ?

ఈ ఆడవాళ్ళ మాటలకి అర్థాలు ఎవరికి తెలుసు !

శకుంతల మాటలు తనకు అర్థమైయ్యాయని అనుకున్నాడు. కాని ఏమైంది.

తను చేసినపనికి జీవితమంతా కృతజ్ఞత చూపిస్తుందని తను ఆనాడు అపోహపడ్డాడు. చివరకు ఏమైంది. జన్మశత్రువుగా మారింది.

తనకు శకుంతల అంటే ఏం ద్వేషంలేదు, కోపంలేదు.

కాని శకుంతల ఎందుకు తనని యింత ద్వేషిస్తోంది.

ఈ ద్వేషాన్ని తొలగించేదెల్లా ?

వెలుగు పోయి చీకటి వస్తోంది. చీకటిని దూరం చెయ్యడానికి దీపాలు వెలిగాయి. జెమ్ అండ్ కంపెనివాళ్ళ నియాన్‌లైట్సు వెలిగాయి.

"Buy Parker"అంటూ దీపాలు వెలుగుతూ అరుతూ వున్నాయి.

పార్కర్ పెన్... తన పెన్ కూడా పార్కరే

“మీ పెన్ ఎంతబాగా రాస్తుందండి. మళ్ళీ యివ్వబుద్ధికావటం లేదు” అని ఏనాడో అన్న మాట మనస్సులో మసలింది.

“ఇది ఎవ్వరికీ యిచ్చే పెన్ను కాదు”

ఇక ఎలా తీసుకుంటారో చూద్దాం !అంటూ పెన్ జాకెట్టులో పెట్టుకుని గలగలా పారిపోయిన దృశ్యం మనస్సులో మెరుపులా మెరిసింది.

గుజరాతీ రెస్టారెంటులోంచి నల్లటి అబ్బాయి చేతిని పుచ్చుకుని అందమైన అమ్మాయి నడిచి వస్తోంది. ఎవ్వరూ చెప్పకుండానే తెలుస్తోంది. వాళ్ళకి ఒకళ్ళంటె ఒకళ్ళకి చాలా యిష్టమని.

అబ్బాయి చెప్పిన మాటకేదో అమ్మాయి బుగ్గలు కెంపువన్నెకొచ్చాయి. చెవులకున్న రవ్వల దుద్దులు ఆ కెంపువన్నెకు తళతళా మెరుస్తున్నాయి.

ఆ జంట తన కనుచాటుకాగానే ఎదురుగుండా షాపులో కనిపించిన గడియారం సాయంకాలం ఆరుగంటల నలభై నిముషాలను టైము ఏడు రంగుల డైయిల్ మీద చూపిస్తోంది.

పెద్ద పెట్టున హారన్ మ్రోగించుకుంటూ టాక్సీ యిటే వస్తోంది. రామం మోటారు సైకిలు బయలుదేరింది, ఏడుగంటలకి యింకా రెండు నిమిషాల వ్యవధి వుండగా, శాంథోమ్ బీచి మొగదల మెట్లదగ్గరకు చేరాడు.

అటూ యిటూ వేరుశనగకాయల దుకాణాల బారులు తీర్చి వున్నాయి. గుంపులుగా జంటలుగా జనం సముద్రానికి వెడుతున్నారు.

చర్చి టవర్ మీద గడియారం ఏడు గంటలు చూపిస్తోంది. చిన్నది తనని చూడనటుగా ముందుకు సాగిపోతోంది. ఆ పిల్ల వెళ్ళిన దిక్కే చూస్తూ సాగిపోతోంది. ఆ పిల్ల వెళ్ళిన దిక్కే చూస్తూ నిలబడ్డాడు... దీపాల వెలుగుదాటి క్రీనీడలో కెళ్ళి కూర్చుంది. తల త్రిప్పకుండానే క్రీగంట చూస్తూ కూర్చుంది.

రామం సరాసరి ఆ పిల్ల కూర్చున్న చోటకు వెళ్ళాడు. ఇతన్ని చూడగానే ఆ

పిల్ల "హల్లో" అని అన్నది.

కూర్చొమని సంజ్ఞచేశింది. రామం కూర్చుని మాట్లాడకుండా సముద్రం వంక చూస్తున్నాడు. విరిగి పడుతున్న కెరటాల నురుగు చూస్తుంటే

అందమైన నల్లటి పిల్ల నవ్వినట్లు అనిపిస్తోంది.

ఆ నవ్వుతో జోడించి యింకొక నవ్వు వినిపించింది. రామం ఉలిక్కిపడి అటు చూసి

"నవ్వుతారు దేనికి ?" అని అడిగాడు.

మిమ్మల్ని చూస్తే ఎవరికైన నవ్వువస్తుంది.

"ఎందుకని?"

ప్రాణంలేని వస్తువుల మీద మమకారం పెంచుకుంటే ప్రాణమున్న వస్తువులకి దూరమవుతాము.

ఏమన్నారు.

విలువలేని వస్తువులకి అవసరమైన ప్రాముఖ్యం యివ్వకండి.

ఎందుకని ?

"అనవసరమైన వాటిమీద వ్యామోహంలో పడితే అవసరమైన వాటిని పోగొట్టుకుంటాం."

రామం ఏం మాట్లాడలేదు ఎక్కడో అనంతంలోకి చూస్తున్నాడు. హార్బరులో నిలచి వున్న స్టీమర్లలో దీపాలు దూరానికి తోరణాలు తోరణాలుగా కనిపిస్తున్నాయి.

మన బాధని యితరులతో చెబితే ఒకొక్క సారి మనసుకి ఉపశమనం కలుగుతుంది.

రామం ఒక్కసారి ఆ పిల్లవంక పరకాయించి చూశాడు. కోలపాటి మొఖం నిగనిగలాడే సొగసు పై పొంగి పొరలే వయస్సు.

దూరం నుంచి ట్రాన్సిస్టర్ రేడియోలో ఇంగ్లీషు పాట.

"గ్రీన్ ఫీల్డ్సు'

"పరాయివాళ్లకు మన బాధలని చెబితే చులకన అవుతామేమో ?"

"స్నేహితులతో చెబితే చులకనకాము."

రామం ఒక్కక్షణం తటపటాయించి "మీ పేరు అడగవచ్చునా ?

పేరు "లలిత"

నా పేరు రామం

మిమ్మల్ని యిక్కడికి ఎందుకు రమ్మన్నానో మీకు తెలుసునా ?

తెలియదు.

'సినిమా కథల్లోలాగా బీచ్‌కి రమ్మన్నానని నే నేదో మిమ్మల్ని ప్రేమిస్తున్నానని అనుకునేరు సుమా ?"

మీరు నన్ను ప్రేమించాలని నేను కోరటం లేదు.

'ఐ.సీ.'... మరైతే ఎందుకు వచ్చారు.

కారణం నాకు తెలియదు.

అంత అమాయకులా ?

మాయలే తెలిసివుంటే ఏనాడో సుఖపడి వుండేవాడిని. మాయవల్ల సుఖం వస్తుందని అనుకోవడం పొరబాటు. నాకావిషయం అంతగా తెలియదు. తెలిసిందల్లా నమ్మకమనేది చాలా భయంకరమైనది, దాని విషం త్రాచుపాము విషం కన్నా భయంకరమైనది.

నమ్మకమనేది జీవితానికి ఆధారమని నేను అనుకుంటాను.

మీరు నాతో అన్నీ విషయాలు ఏకీభవించాలని నేను కోరంటం లేదు.

ఎందుకని ?

మనం పరాయివాళ్ళం. మన మనస్తత్వాలు పూర్తిగా విభిన్నం

"లలిత గలగలా నవ్వింది."

నవ్వుతున్నావు దేనికి ?

"మిమ్మల్ని ఎప్పుడో ఎవరో బాగా మోసం చేశారు. అందుకనే మీకు అందరిని చూస్తే అపనమ్మకం."

రామం నేను మాట్లాడ లేదు.

మొగవాళ్లకి చొరవ ఎక్కువని విన్నాను.

మనం విన్నవన్నీ నిజం కాకపోవచ్చు

మరి నిజమేది ?

ఎన్నటికీ మారనిది

మనుష్యులతో బాటు నిజం కూడా మారవచ్చుగా

మారేదాన్ని నిజమని అనుకోవడం పొరబాటు

ఈ పొరబాటుని సరిదిద్దుకోవటం ఎట్లా ?

తెలియదు !!!

కొద్దిక్షణాలు రెండు మనస్సులు మూగబోయాయి. రెండు హృదయాలు ఏదో సీమలో విహరిస్తున్నాయి.

గడియారం ఎనిమిది గంటలు చూపించింది. రేడియోలో పాట మారింది. సముద్రపు ఒడ్డున రద్దీ తగ్గింది. ఎడారిలో జలాశయాలలాగా దూరదూరంగా అక్కడో జంట అక్కడో జంట కూర్చుని వున్నారు.

రేడియోలో పాట మారింది.

సుదవోల్ సుహాసిని

మదువవోల్ విలాసిని...

ఈ పాట నాకు చాలా యిష్టం అని లలిత అన్నది.

రాము ఏం మాట్లాడలేదు. సముద్రం వంక ఒక్కసారి చూశాడు.

ఇంటికి వెడదామా ? అని అడిగాడు.

మనం కలిసి రాలేదుగా ?

కాని కలిసి వెళ్ళవచ్చునుగా

ఎంత దూరం

కాల సాగినంతమేర

అయే మీ మోటారు సైకిలుదాకానా !

ఈసారి నవ్వడం రామం వంతు

మీరు ఏం పని చేస్తున్నారు ? అని అడిగాడు.

"ఒక ఫిలాసఫర్‌కి స్టెనో గ్రాఫర్‌గా వుంటున్నాను."

వయస్సుకి మించిన పని.

కాని ఆయన చాలా సరసుడు

అంత సరసుడైన వేదాంతి ఎవరబ్బా

మీరు అడగకూడదు నేను చెప్పకూడదు.

అడిగేవాడికి చెప్పేవాడు లోకువనా ?

అబ్బే కాదు, అందరికి సమస్యలూ మనవికాదు కనుక

"థక్యూ" ఇంటికి వెడదాం.

అసల్లని తొందర పడవలసింది నేను !!!.... ఇంటి దగ్గర పెళ్ళాం పిల్లలు ఎదురుచూస్తూ వుంటారా ?

"పెళ్ళాం పిల్లలు" రామాన్ని ఎవరో వెన్నున కొరడాతో ఛళ్ళున కొట్టినట్టు అనిపించింది.

"గుడ్‌నైట్" అంటూ రామం ముందుకుసాగాడు.

లలిత కూర్చున్న చోటునుంచి కదల్లేదు.

గుడ్‌నైట్... Same time tomorrow అని అన్నది.

సముద్రతీరం దాదాపు నిర్మానుష్యం అయింది. లలిత మెల్లిగా ఒక్కొక్క అడుగేవేసుకుంటూ యింటికి దారితీసింది.

రామం యింటికి చేరేసరికి రాత్రి దాదాపు ఎనిమిదిన్నర అయింది. ఇంటికి చేరుతూ వుండగా పెన్ను సంగతి గుర్తుకు వచ్చింది.

అంతులేని చిరాకు కలిగింది.

కారణం లేకుండా పెన్ను పగిలిందని చిరాకువేస్తోంది. కాని కారణం లేకుండానే హృదయాన్నే పగలగొట్టిన వాళ్ళని ఏమనాలి.

ఇంటి దగ్గర అమ్మ ఎదురైంది.

"నీ కెవరో ఉత్తరం రాశారురా" అంటూ కవరు యిచ్చింది. చెప్పక్కర్లేదు ఆ దస్తూరి ఎవరిదో తనకు తెలుసు, ఒక్కసారి మనస్సుకి ఏదో నిర్లిప్తత ఆవరించింది.

ఏం రాసి వుంటుంది ? టెలిఫోను చేశానని తిట్టి వుంటుంది. ఆ ఉత్తరం విప్పకుండానే బల్ల మీద పెట్టి.

భోజనానికి వెళ్ళిపోయాడు.

"నువ్వింట్లోంచి వెళ్లగానే శకుంతలా వాళ్లనాన్నగారు వచ్చారు."

ఆయన మదరాసు దేనికి వచ్చారు ?

"రిటైర్ అయిపోయిన తరువాత ఈ వూళ్ళో ఏదో ఉద్యోగం దొరిందట, మనల్ని చూద్దామని వచ్చాడు."

బాగుంది

శకుంతలకు యిద్దరు పిల్లలట. ఆ మొగుడు సరిగ్గా చూడడు. బాగ తాగి యింటికి వస్తాడట. ఆయన ఒకటే గోల.

అల్లుడు సరాయివాడేం కాదుగా, మేనల్లుడేగా.

చుట్టరికం దగ్గరే, కాని మనిషి దూరం.

శకుంతల కావాలని చేసుకుందిగా ?

కావాలని చేసుకోవటానికి అభంశుభం తెలియని పిల్లదానికేం తెలుసు కావని

చేసుకుంటావా తల్లీ అని అడిగితే సిగ్గుపడి వూరుకుని వుంటుంది.

అదేమిటిరా? అన్నం సరిగా తినటంలేదు.

అమ్మ సాయంత్రం టిఫిన్ బాగా తిన్నానమ్మా ! ఏం మాట్లాడలేదు. రెండు ముద్దలుతిని రామం లేచాడు. తను మేడమీదకు వెడుతూ వుంటే ఉత్తరం సంగతి జ్ఞాపకం వచ్చింది. ఉత్తరం చించి చూశాడు.

రామం !

నేను ఎల్లా ఉంటే నీకేం రామం ! బ్రతికే వున్నానులే ఏం ఫరవాలేదు, కాని ఈ బ్రతుకులో అనుక్షణం వెయ్యిచావులు వున్నాయని తెలుస్తే ఏనాడో ఈ జీవితం నుంచి దూరం అయ్యేదాన్ని కాని నేను ఎప్పుడూ అశక్తురాలినే, కడుపున పుట్టిన యిద్దరు పిల్లల్ని నేను వదిలి వెళ్ళలేను. రామం ! నేను చాలా మొండిదాన్ని. మీరంతా అనుకున్నంత తేలికగా నేను చావను. ఆ రోజున నీకు ఎల్లాగో తెలియపరుస్తానులే. నన్ను సర్వనాశనంచేసి యింకా సానుభూతి దేనికి రామం.

నిన్నురోజూ శపిస్తూనే వుంటాను. నువ్వు మాత్రం నాకోసం తపిస్తూవుండు.

పరాయి శకుంతల

నాకోసం తపిస్తూ వుండు.

ఎందుకని ? ఎందుకని ?

ఎంత మాట అన్నావు శకుంతలా ? నిన్ను నేను సర్వనాశనం చేశానా.

ఎందుకూ ఈ ద్వేషం ? ఎందుకు ఈ కార్పణ్యం నీ మనస్సుకి తెలియదా ? ఎవరిది దోషమో ?

ఎందుకని ? పీడకలలాగా నామనస్సుని చిందర వందర చేస్తున్నావు.

అపకారం చెయ్యని అశక్తున్నినా? ఈ కోపం

నీకు ఈనాడు జ్ఞాపకం లేకపోవచ్చు కాని నాకు ఎన్నటికీ మరుపురాదు.

పిలువని పేరంటంగా ఆనాడు నువ్వే మా యింటికి వచ్చావు.

"పిన్నిగారూ ! మేము ఈప్రక్కఇంట్లోకి అద్దెకి వచ్చామండి, నాన్నగారికి ఈ వూరు ట్రాన్సఫర్ అయింది." అంటూ ఆ రోజున శకుంతల వచ్చింది.

నాన్నగారి పేరు ఏమిటి ?

రామచంద్రరావుగారు, గవర్నమెంటు ఇంజనీరు.

ఆ అమ్మాయి చలాకీతనం అందం అమ్మకి వెంటనే నచ్చాయి. "మీ అమ్మగారి కూడా తీసుకురాకపోయావా ?"

అమ్మ నా చిన్నప్పుడేపోయిందండి.

అయ్యోపాపం ! తోడబుట్టిన వాళ్ళున్నారా ?

లేరండి. నేను రెండేళ్ళ పిల్లగా వుండగా మా అమ్మపోయిందండి. అప్పటి నుంచి తాతగారింట్లో పెరిగానండి. మా నాన్నగారు పంపించమంటే ఈ సారి మా తాతయ్య పంపించారండి.

"మీ నాన్నగారు..."

నాన్నగారు మళ్ళీ పెళ్ళి చేసుకున్నారండి....

అల్లాగా... ఈ అమ్మకు ఎవరైనా పిల్లలున్నారా ?

లేరండి... ఇద్దరు మొగపిల్లలు పుట్టిపోయారండి.

పాపం.. !

పాపమేనండి. మాపిన్నికి పిల్లలంటే చాలా యిష్టమండి.

సహజమే !...

అప్పుడే బజారు నుంచి వచ్చిన రామం అమ్మతో యింతచనువుగా మాట్లాడుతున్న పిల్లని చూసి వంటింట్లోకి వెళ్ళబోతున్నవాడు అక్కడి నుంచే వెనక్కి తిరగబోయాడు.

శకుంతల తన వంక కన్నార్పకుండా చూసింది.

మా అబ్బాయి అంటూ అమ్మ పరిచయం చేసింది. శకుంతల వెంటనే నమస్కారం చేసింది. తను మాట్లాడేలోపలే

"కూర్చోండి" అని అంది.

"థాంక్యూ" అంటూ తను కూర్చున్నాడు.

"అన్నట్టు మా అబ్బాయి కూడా పూనాలో ఇంజనీరింగ్ చదివాడు" అని అమ్మ అన్నది.

"అయితే నాకు లెక్కలు చెప్పగలరన్నమాట. నేను లెక్కల్లో ఎప్పుడూ చివరినుంచి ఫస్ట్."

ఏం చదువుతున్నావు.

"బి.ఎస్.సి."

మీకు చెప్పేలెక్కలు నాకు రావు

నేను నమ్మను... మొగవాళ్ళకు లెక్కలు రాకపోవటమేమిటి ?

నేను బిగ్గరగా నవ్వాను. అమ్మ మాయిద్దరి వంకా ఆశ్చర్యంగా చూస్తోంది.

మాకు చెప్పే లెక్కలకి మీకు చెప్పేవాటికి ఏమి సంబంధం వుండదు.

శకుంతల ఏంమాట్లాడలేదు. రామం లేచి తన గదిలోకి వెళ్లిపోయాడు.

కొంచెంసేపటికి శకుంతల వాళ్లయింటికి వెళ్లిపోయింది.

అమ్మ నవ్వి "చాలా మంచి పిల్లలాగా వుంది" అని అంది.

వర్షాకాలం వెళ్ళి శీతాకాలం వచ్చింది. తొందరగానే వసంత ఋతువు వచ్చింది.

ఆ రోజున అమ్మ యింట్లో లేదు, గుడికి వెళ్లింది. శకుంతల నాన్నగారు ఆఫీసు పని మీద ఊరు వెళ్లారు..

తను ఒక్కరూ యింట్లో కూర్చుని హీట్ యింజను పుస్తకం చదువుతున్నాడు.

వెనుక నుంచి మెత్తటి చిరునవ్వు వినిపించింది. తను అటు చూడకుండానే

"అమ్మ గుడికి వెళ్లింది" అని అన్నాడు.

"అందుకనే వచ్చాను" అని సమాధానం వచ్చింది.

ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూశాడు.

శకుంతల నిలబడివుంది. నిలబడి వుండటమే కాదు. తన వంక చిరునవ్వుగా చూస్తోంది.

సినిమాలు చూటం అలవాటున్న తనకు ఆ చూపులో అర్థం తెలుసు.

ఆ చూపులో ఎన్నో ఆశలున్నాయి. ఆ చిరునవ్వుతో ఎన్నో పిలుపులున్నాయి.

తను అల్లాగే నిశ్శబ్దంగా చూస్తున్నాయి శక ంతల తన వంక చిలిపిగా చూస్తూ

"కలకాదులే నిజమేలే" అని అన్నది.

"ఇది పగలు" అని తను అన్నాడు.

"అప్పుడే ఎవరికీ అనుమానం కలుగదు"

ఈసారి తను తీక్షణంగా శకుంతల వంక చూశాడు.

"కోపమొచ్చినట్టున్నదే ?"

ఎందుకొచ్చావు శకుంతులా ?

శకుంతల కొంటెగా తనవంక చూసి నవ్వింది.

"ప్రవరుడివా ?" యీ ప్రశ్న తనకు అర్థం కావటానికి అరక్షణం కన్నా ఎక్కువలేదు.

నువ్వు వరూధినివైతే నేను ప్రవరుడినే

అంటే దోవ చూపించవలసింది నేను అన్నమాట.

నాకు దోవ తెలియనప్పుడు

భయపడుతున్నావా

అసహ్యించుకుంటున్నాను

అసహ్యమా ? ప్రేమలో అసహ్యం ఒక భాగం కాదే ?"

కాన జీవితంలో అసహ్యం ఒక భాగం

ఎందుకని ?

తన భార్య శీలవతిగా వుండాలని ప్రతి పురుషుడూ కోరుకుంటాడు.

కాని తను మాత్రం కనబడ్డ ప్రతి ఆడపిల్ల వెంట పరుగెత్తవచ్చు.

నా విషయంలో మాత్రం అది నిజం కాదు.

సత్యహరిశ్చంద్రుడివా ?

కాదు శ్రీరామచంద్రుడిని

అడవులపాలై పోదామంటావా

నీవెంట మాత్రం కాదు.

శకుంతల ఒక్కక్షణం మౌనంగా వుంది. తలవంచుకుని బొటనవేలు నేలమీద రాస్తూ "కోపం వచ్చిందా" అని అడిగింది.

"లేదు బాధ కలిగింది. ఇంటికి వెళ్ళు"

శకుంతల తర దగ్గరకు వచ్చింది.

పెద్దన్నగారు చెప్పింది నిజమా అని అన్నం.

వనితలు తా వలచి వచ్చిన...

ఒక్కమాట మాత్రం నమ్ము శకుంతలా ! చులకన మాత్రం కాలేదు.

అందుకనేనా ఈ నిరాదరణ ?

ఆదరణ ఎన్నటికీ మారదు.

గుమ్మంలోంచి అమ్మ కంఠం వినిపించింది. ప్రతిరోజుకి మల్లే నవ్వుతూ శకుంతల అమ్మని పలుకరించలేదు, అమ్మకి కనబడకుండా తను యింటికి వెళ్లిపోయింది.

అమ్మ తన గదిలోకి వచ్చి... "శకుంతల వచ్చిందా ?" అని అడిగింది.

వచ్చిందమ్మా. నువ్వులేవని చెబితే వెళ్లిపోయింది. అని అబద్ధం ఆడాను.

అమ్మ మనస్సులోంచి ఒక నిట్టూర్పు వచ్చింది. ఎల్లా బ్రతుకుతుందో కాని ఉత్త అమాయకురాలు రా" అని అన్నది.

ఆనాటి వరకూవున్న శకుంతలని ఈనాటి శకుంతలని మనస్సు పదే పదే పోల్చిచూచుకుంది.

శకుంతల తనని ప్రేమిస్తోందా ? లేకపోతే అది వయస్సు పెంచిన వూహలా ?

తొలివలపులో బిడియమంటుందంటారు. ఈ చిన్న దానిలో ఆ తీరేంకనిపించదేం.

అభిసారికలా వచ్చింది. ఈ చిత్రాంగికి తనే ఒక జడభరతుడుగా మిగిలిపోయాడా?

కాలుజారితే తను ఆ కన్నె వంక కన్నెత్తి చూడగలడా ?

ఈ తెంపరి కన్నె అని నమ్మకమేమిటి ?

నమ్మకం లేకపోతే జీవితమేమిటి ?

కాగితం పువ్వు ? దైవం లేని ఆపజయం !!

రోజులు, వారాలు, పక్షాలు గడిచాయి. శకుంతల ఈ చాయలకి రాలేదు.

రావటంలేదేమని అమ్మ అడగనూలేదు.

ఒకరోజు సాయంకాలం శకుంతలా, వాళ్ళ నాన్నగారు తను యింటికి వచ్చారు.

"అమ్మాయిని చూడటానికి పెళ్లివారు వస్తున్నారు. మీ సాయంకావాలి" అని అమ్మతో అంటూ తన వంక చూసి "నువ్వుకూడా రా రామం" అని అన్నారు.

పెళ్ళివారు వచ్చారు. శకుంతలని చూసి వెళ్లారు.

వారం తిరగకుండా కబురు వచ్చింది. యీ అందాలరాశి నచ్చలేదని.

ఎందుకని ?

ఏమో ?

శకుంతలని అడిగే ధైర్యం తనకు లేకపోయింది. తరువాత అడగవలసిన అవసరం లేకపోయింది.

ఎవరెవరో మొగపిల్లలతో శకుంతల తనకి పార్కుల్లో, సినిమాల్లో కనిపించడం మొదలుపెట్టింది.

సినిమాలో రిజర్వుడులో కూర్చొని మ్యాటినీ చూస్తు ప్రక్కన కూర్చున్న కాలేజీ కుర్రవాడితో ఏదో నవ్వుతూ చెబుతోంది.

తను అటుచూడగానే ముఖం ప్రక్కకు తిప్పుకుంది.

మర్నాడు అమ్మ తనతో అంది, "శకుంతలని సవతి తల్లి నానాబాధలు పెడుతుందట" అని.

తనేం మాట్లాడలేదు...

మళ్ళీ కొన్ని రోజులదాకా శకుంతల తనకు కనిపించలేదు.

ఆ రోజూ కార్తిక పూర్ణిమ. అంతా సముద్రస్నానానికి వెళ్లారు. తను కూర్చుని ఇంటి దగ్గర చదువుకుంటున్నాడు.

శకుంతల వచ్చింది. ఈసారి చిలిపితనం కాని, అల్లరికాని ఆ మనిషిలో లేవు. మనిషిలో ఏదో విప్లవం కనిపిస్తోంది.

"నా పెళ్ళి" అని అన్నది.

తను ఉలిక్కిపడ్డాడు.

"నేను పెళ్ళి చేసుకుంటున్నాను రామం" అని శకుంతల అన్నది.

"సంతోషం"

"నాకేం సంతోషంగా లేదు రామం... అసహ్యంగా వుంది."

ఎందుకని ?

ఎందుకనో తరువాత చెబుతాను. ముందు కంగ్రాచ్యులేషన్సు చెప్పవేం.

కంగ్రాచ్యులేషన్సు !! పెళ్లికొడుకు ఎవరు ?

ఖంగారుపడకు !! నువ్వుకాదులే !! గంతకుతగ్గ బొంత !!

రామం ఏం మాట్లాడలేదు.

ఒక్కమాట అడగనా రామం

"ఏమిటి ?"

నన్ను ఎప్పుడూ నువ్వు ప్రేమించలేదా ?

రామం ఏం మాట్లాడలేదు

దేవదాసు చదివావా రామం

చదివాను

నేను కూడా చంద్రముఖిలాగా మారిపోతున్నాను.

ఎందుకని ?

మనల్ని ప్రేమించని వారి దగ్గర మన ప్రేమని వెల్లడి చేయడంకన్నా తెలివితక్కువ పని ఇంకొకటి లేదు. వాళ్ళు మనల్ని ప్రేమించరు సరికదా అసహ్యించుకుంటారు.

నేను నిన్ను అసహ్యించుకోవటం లేదు శకుంతలా ?

ప్రేమించటం కూడా లేదు ! అంతే కదూ.

రామం ఏమీ ఈ మాట్లాడలేదు, శకుంతలా కొన్ని క్షణాలు ఏం మాట్లాడలేదు.

"రామం !"

ఏమిటి శకుంతలా ?

శరత్ అన్నమాట నిజమే.

ఏమిటది ?

మన ప్రవేశాన్ని అరికడుతూ ఒక ద్వారం మూయబడితే మనకి స్వాగతం యిస్తూ యింకొక ద్వారం తెరుచుకుంటుంది. కాని మూసిన ద్వారం వంక చూస్తూ నిలబడిపోయిన మనం తెరిచిన ద్వారాన్ని గుర్తించలేము.

"ఈ యింటి తలుపులు ఎప్పుడూ నీ కోసం తెరిచివుంటాయి శకుంతలా"

పరాయిదాన్నిగా ఈ యింటికి రావాలని నేను కోరటంలేదు రామం.

నువ్వు పరాయిదానివని ఎవరన్నారు ?

నీదాన్ని కానప్పుడు పరాయిదాన్నేగా !!!

శకుంతలా !!!

సిగ్గువిడిచి చెబుతున్నాననా ఆశ్చర్యం ?

దీంట్లో సిగ్గుపడవలసింది ఏముంది ?

నీకోసం ఒక చిన్న కానుక తీసుకువచ్చాను రామం

ఏమిటది !

"తీసుకో" అంది ఒక చిన్న ప్యాకెటు తనకు యిచ్చింది. నీలంరంగు పెన్ను దానికి బంగారపు క్యాపు బాడీమీద శకుంతల అని పేరు.

థాంక్యూ శకుంతలా ! థాంక్యూ వెరీమచ్ !

శకుంతల ఏమి మాట్లాడలేదు కిటికీలోంచి బయటకు చూస్తోంది. బయట దూరంగా ఏదో కాదు ఆగిన శబ్దం వినిపించింది. తను కూడా కిటికి దగ్గరకు వెళ్ళి నిలబడ్డాడు. ఆగినకారు మళ్ళీ బయలుదేరి వెళ్లిపోయింది.

శకుంతల తనవంక చూచింది.

తను శకుంతల చేతిని తనచేతిలోకి తీసుకున్నాడు. తన గుండెలమీద తలవాల్చి శకుంతల వెక్కి వెక్కి ఏడ్చింది.

నన్నుక్షమించు శకుంతలా అని అన్నాడు.

శకుంతల తలెత్తి చూడకుండానే "నన్ను నీదాన్ని చేసుకోరామం" అని అన్నది.

రామం మాట్లాడలేదు.

వివాహం చేసుకోనక్కరలేదు. రామం నేను ప్రేమించిన వ్యక్తికి నా సర్వస్వం అర్పించిన సంతృప్తి నాకు కలగనియ్యి.

అది పాపం శకుంతలా ?

భయపడవలసిన దాన్ని నేనే రామం.

ఒక అమాయకుడికి అన్యాయం చేయలేను

శకుంతల తన కౌగిలినుంచి దూరంగా జరిగినది.

గుమ్మందాకా వెళ్లి ఒక్కసారి వెనక్కి తిరిగి చూసింది. ఆ చూపులో హేళన వుంది.

"నేనొక మొగవాడిని ప్రేమించానని యింతకాలం భ్రమపడ్డాను" అని అంది. తన వెన్నున ఎవరో కొరడాతో కొట్టినట్లు అనిపించింది.

కాని అంతలోనే పెద్ద పెట్టున నవ్వాడు.

Dont Come Back అని అన్నాడు.

శకుంతల మళ్ళీ తిరిగిరాలేదు. కాని శకుంతల గత తలంపులు యీనాటికీ తనని పీడకలలాగా పీడిస్తూనే వున్నాయి.

శకుంతల పెళ్ళికి ఎవ్వరూ వెళ్లలేదు, గ్రీటింగ్సు, టెలిగ్రాము కూడా పంపించలేదు.

పంపించానని అమ్మతో అబద్ధం ఆడాడు.

శకుంతలని గురించి చెదురు చెదురుగా వార్తలు వచ్చేవి. అవన్నీ చెడ్డవార్తలే..

కాని పున్నమి వచ్చినప్పుడల్లా శకుంతల తలంపుకు వచ్చేది. మనస్సుని వలచివేసేది.

శకుంతలని చూడాలి ! శకుంతలని చూడాలి ! ఇదే తపన ! ఇదే ఆరాటం అంతులేని ఆవేదన !

మదిలో స్మృతిగా నిలచి కరడుకట్టిన బాధల గాథ వెలుగులేని ఈనాడు కన్నీటి వెల్లువైంది.

తూరుపు తెలతెల్లవారింది, చల్లటిగాలితోబాటు, మనస్సు మెల్లమెల్లన తేలిక అయింది. చీకూచింతా దూరమైతే సుషుప్తి చేరువైంది.

శకుంతలకి నిజంగా ధూరంకావాలి ఇదే ఈనాటి ఆకాంక్ష !!
దూరంగా రేడియోలో పాట వినిపిస్తోంది. గుడిలో గంటలు మోగుతున్నాయి.

ఎప్పుడో పట్టిన నిద్ర యిట్టె మెళుకువ వచ్చింది. కన్ను తెరిచి చూస్తే

ఎదురుగుండా అమ్మనాన్నల ఫొటోలు కనిపించాయి.

అమ్మ ఎప్పటిలాగానే తన వంక నవ్వుతూ చూస్తోంది. అమ్మ నవ్వుతోబాటు అమ్మమాట కూడా గుర్తు వచ్చింది. "ఎవరి బ్రతుకు వాళ్ళు బ్రతకాలి రామం!"

నిజమే ! ఎవరిబ్రతుకు వాళ్ళు బ్రతకాలి.

పుస్తకాల బల్లమీద పగిలిన పెన్ను కనిపించింది. అంతులేని చిరాకు కలిగింది.

వంట యింట్లోంచి అమ్మపాట వినిపిస్తోంది. శకుంతల రాసిన ఉత్తరం మళ్ళీ యింకొకసారి చదువుకున్నాడు.

శీలవతికాని మనిషిని గురించి తను యింతకాలం వ్యర్థంగా తపనపడ్డాడు. మన మంచితనాన్ని అర్థం చేసుకోలేని మనిషి కోసం తను గాయపడ్డాడు.

ఇంతకాలం చిక్కు ప్రశ్నగా వున్న సమస్య ఈనాడు యింత తేలికగా పరిష్కారం అయిందే ?

శకుంతలని మరచిపోవాలి !

తొమ్మిదిగంటలు కొడుతూ వుండగా శాంథోమ్ బస్సుస్టాపు దగ్గరకు వచ్చాడు. మోటారు సైకిలుకు స్టాండు వేసి నిలబడ్డారు. తొమ్మిదన్నర కొడుతూ వుండగా లలిత యిటే నడచి వచ్చింది. ఇతన్ని చూడగానే ముఖంలో చిరునవ్వు కనిపించింది. దగ్గరకు నడిచి వచ్చింది.

"నమస్తే" అని అన్నాడు.

"నమస్తే" అని కళ్ళతోనే బదులు పలికింది.

"మీ మాటలు నాకు నచ్చాయి." అని అన్నాడు.

ఉలిక్కిపడ్డది.

మీరు నిన్న అన్నమాటలు రాత్రి చాలాసేపు ఆలోచించాను. నా సమస్యకు పరిష్కారం దొరికింది.

ఏమిటది.

అవసరమైనవాటికి అక్కర్లేని విలువలు యిస్తే వచ్చే బాధ ఏమిటో నాకు యిప్పుడు తెలిసింది.

అప్పుడేం జరిగింది ?

అంతులేని ఆనందం కలిగింది.

"ఒక్క నిమిషం వుండండి" అంటూ లలిత విసవిసా ఎక్కడికో వెళ్ళి అయిదు నిముషాలలో తిరిగి వచ్చింది.

"ఈ రోజు శెలవు పెట్టాను. రండి మా యింటికి వెడదాం" అంటూ యింటికి దారితీసింది.

ఇంటిదగ్గర ఎవ్వరూ లేరు.

రామం ఇల్లంతా కలయజూచి "ఇంట్లో ఎవ్వరూ లేరా" అని అడిగాడు.

అంతా మా వూళ్ళో వుంటారు.

అంతా అంటే ?

మా అమ్మ, ముగ్గురు చెల్లెళ్ళు

మీరూ ?

నేను ఉద్యోగం చేసి వాళ్ళని పోషిస్తున్నాను.

నాన్నగారు

చిన్నప్పుడే పోయారు.

పాపం మీ చెల్లెళ్ళు ఏం చేస్తున్నారు.

ఇద్దరికి పెళ్ళి చేశాను. ఇంకొక చిన్నపిల్ల చదువుకుంటోంది.

మీరు...

నేను పెళ్ళిచేసుకుని అత్తవారింటికి వెళ్ళిపోతే ఎల్లా ? వీళ్ళని ఎవరు పోషిస్తారు.

మీరు....

అందరికి అన్నీ ప్రాప్తంకావు.

"మిమ్మల్ని అర్థంచేసుకుని మీతో సహకరించగలవారు లభిస్తే ?"

అది కథల్లోను, సినిమాల్లోను జరిగేనవి.

రామం కొద్దిక్షణాలు ఏం మాట్లాడలేదు...

జాలిపడుతున్నారా ?

లేదు పరిష్కారానికి మార్గం ఆలోచిస్తున్నాను.

కొన్ని జీవితాలకి మృత్యువే పరిష్కారం

లలితా !!

లలిత ఏం మాట్లాడలేదు. ముఖం ప్రక్కకు తిప్పుకుంది.

రామం కుర్చీలోంచి లేచి లలిత దగ్గరకు వచ్చాడు.

ఈనాడు నేను మీకు పరాయివాడిలాగా కనిపించవచ్చు. కాని నేను మీ మిత్రుడినని మీ మనస్సుకి తెలిస్తేచాలు.

లలిత యితనివంక ఆశ్చర్యంగా చూస్తోంది.

నేను మీకు తగినవాడినని మీకు నమ్మకం కలిగినవాడు, నా జన్మ తరిస్తుందని నమ్మండి.

లలిత కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

ఊహించుకున్న కష్టాలని తలచుకుని ఇంతకాలం బాధపడ్డాను. నిజమైన కష్టాలు ఈ రోజున అర్థం చేసుకున్నాను.

"నిజమా ?" అని లలిత అడిగింది.

ఇదే ముమ్మాటికి నిజం !!

లలిత ముఖంలో ఆనందం కనిపించింది.

"ప్లీజ్ ! గో !" అని అన్నది.

రామం మోటారు సైకిలు దగ్గరకు వచ్చాడు. మబ్బుచాటున సూర్యుడు వెలుగులోకి వచ్చాడు.

సిగరెట్టుకోసం జేబులో చెయ్యిపెట్టాడు. మడత పెట్టిన కాగితం, పగిలిపోయిన పెన్ను చేతికి తగిలాయి. పెన్నుతీసి ఒక్కసారి చూశాడు.

వడివడిగా అంగలు వేసుకుంటూ బ్రిడ్జి దగ్గరకు వెళ్ళాడు. నీళ్ళు నెమ్మదిగా నడుస్తున్నాయి. పెన్ను కాలువలోకి విసురుగా గిరాటువేశాడు. ఉత్తరం చిన్నచిన్న ముక్కలుగా చింపివేశాడు. ఎక్కడిదో సుడిగాలి వచ్చి చేతిలో కాగితం ముక్కలని ఎగరవేసుకుని పోయింది. ఒక చిన్న ముక్క మాత్రం మిగిలింది. "నువ్వు మాత్రం నాకోసం తపిస్తూవుండు."

రామం ముఖంలో చిరునవ్వు వచ్చింది. కాగితాన్ని కాలువలోకి జారవిడిచాడు.

నేను ఎవరికోసమూ తపించను శకుంతలా, ఈ విశాల ప్రపంచంలో ఎవరిబ్రతుకు వాళ్ళు బ్రతకాలి.

ట్రాన్సిస్టరులో "Beatles" Love me so you know I Love You అన్న పాట వినిపిస్తోంది.

రామం ముఖంలో పగలే వెన్నెల విరిసింది. చిరునవ్వుతో మోటారు సైకిలు కదిలింది.